సాక్షి గుంటూరు

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



ఎస్పీని కలసిన పీఎస్ఐలు

నగరంపాలెం: జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో శిక్షణ పొందుతున్న పీఎస్ఐలు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



ముంపు పొలాలు పరిశీలన

కొల్లిపర: మండలంలోని పలు గ్రామాల్లో ముంపునకు గురైన ఉద్యాన పంటలను జిల్లా ఉద్యానవన అధికారి జి.రవీంద్రబాబు సోమవారం పరిశీలించారు.



చండీ హోమం

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం చండీహోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

నూతన ఉపాధ్యాయులకు అభినందన



గుంటూరు వెస్ట్: జిల్లాలో ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ తీసుకుని ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్ లైన్‌లో 117 మందికి, ఆన్‌లైన్‌లో 217 మందికి డీఎస్సీ కోచింగ్ అందించారు. వీరిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ 14 మంది, స్కూల్ అసిస్టెంట్‌గా నలుగురు ఉద్యోగాలు పొందారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయటంతోపాటు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వారికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి పాల్గొన్నారు.

శ్రీరాముడిని తాకిన సూర్యకిరణాలు



బల్లికురవ: దసరా శరన్నవరాత్రులు, మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం మండలంలోని కొత్తపాలెం రామాలయాన్ని సూర్యకిరణాలు తాకాయి. దక్షిణాయన పుణ్యకాలంలో పర్వదినాన సూర్యకిరణాలు శ్రీరామ చంద్ర స్వామిపై పడటం ఎంతో శుభపరిణామని ఆలయ అర్చకులు ఐనవోలు సుబ్బాచార్యులు శివసాయి అన్నారు. పంచామృతాలతో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, హరిద్రా చూర్ణ లేపనం అష్టోత్తర శతనామ పూజ, ప్రత్యేక అలంకరణ, దివ్యమంగళ హారతి చేపట్టారు. ఆ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



బాపట్ల: సచివాలయం ఉద్యోగస్తులు ఆత్మగౌరవ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయంలో వలంటీర్లను తొలగించి వారు చేసే ప్రతి పనిని ఉద్యోగులతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిపై సర్వేల భారం పెట్టి మరీ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడితో తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్ఓ నుస్రత్ మండ్రూప్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్ - అనకాపల్లి (07059) ప్రత్యేక రైలు అక్టోబర్ 6, 13, 20, 27 తేదీల్లో ప్రతి సోమవారం రాత్రి ఏడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07060) 7, 14, 21, 28 తేదీల్లో ప్రతి మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు అనకాపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. రెండు మార్గాల్లో ఈ రైలు చర్లపల్లి, పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, కృష్ణా కెనాల్, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో ఆగుతుంది.

సరస్వతీ నమస్తుభ్యం !



మంగళగిరి నృసింహస్వామి ఆలయంలో శ్రీ సరస్వతీదేవి అలంకారం



మంగళగిరిలోని జీఆర్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో చిన్నారులు, మహిళల పూజలు



గుంటూరు నగరంలోని కొరిటెపాడు సెంటర్‌లో సరస్వతీదేవి అలంకారం



పెదకాకాని శివాలయంలో సరస్వతీ దేవిగా భ్రమరాంబ అమ్మవారు

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. చదువుల తల్లిగా..జ్ఞాన ప్రదాయినిగా పలు ఆలయాల్లో అమ్మవారు సోమవారం సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మ నక్షత్రం సందర్భంగా పలు పాఠశాలల్లో సరస్వతి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామ రూపిణీ ! అంటూ ప్రార్థించారు. చక్కని జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని ఇవ్వాలని కోరారు. ప్రసిద్ధ పెదకాకాని శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు వీణాధరిగా పూజలందుకున్నారు. విద్యార్థులు, మహిళలు దర్శించుకుని సకల జ్ఞానాన్ని ప్రసాదించాలని కోరారు. మంగళగిరిలోని నృసింహ ఆలయంలో అమ్మవారు సరస్వతి మాతగా శోభాయమానంగా దర్శనమిచ్చారు.

-మంగళగిరి / నగరంపాలెం/ పెదకాకాని

కూటమి కక్ష.. శిక్ష

- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు
- తాజాగా ముగ్గురిపై కేసు నమోదు చేసిన సీఐడీ
- సోషల్ మీడియా యాక్టివిస్ట్‌పై గంజాయి కేసు పెట్టిన పోలీసులు
- హైకోర్ట్ అక్షింతలు వేసినా తీరు మార్చుకోని ప్రభుత్వం
- తీర్పుతో కంగుతిన్న పోలీసు యంత్రాంగం
- జిల్లాలో కొనసాగుతున్న రెడ్‌బుక్ పాలన



సాక్షి ప్రతినిధి, గుంటూరు: పాలనలో అవినీతి, హామీల అమలులో వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం వేధింపులకు దిగుతోంది అక్రమ అరెస్టులు చేసి కేసులు పెడుతోంది. స్టేషన్‌కు పిలిచి బెదిరింపులకు దిగుతోంది. వారం రోజులుగా సోషల్ మీడియా కార్యకర్తలే టార్గెట్‌గా పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయినా ప్రభుత్వం తీరు మార్చుకోలేదు. సీఐడీని అడ్డం పెట్టుకొని కేసులు పెడుతూనే ఉంది. సోషల్ మీడియా కార్యకర్త రవీంద్ర రెడ్డిపై ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైన నేపథ్యంలో పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. సీబీఐ విచారణకు ఆదేశాలు జారీ చేసింది.



శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన గడ్డం శివప్రసాద్‌ను అరెస్టు చేసిన సీఐడీ పోలీసులు

కూటమి దౌర్జన్యానికి సాక్ష్యాలు ఇవిగో..

సోషల్ మీడియా కార్యకర్తలను అణగదొక్కాలని కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అధికారంలోకి వచ్చి నాటి నుంచి రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తూనే ఉంది. కూటమి ప్రభుత్వ చేతిలో సీఐడీ కీలుబొమ్మగా మారింది.

- ఇటీవల సోషల్ మీడియా యాక్టివిస్ట్ వజ్రాల తారక ప్రతాప్‌రెడ్డి, సాయి భార్గవ్‌లపై కూటమి నేతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసింది. విచారణ నిమిత్తం గుంటూరు సీఐడీ కోర్టుకు తరలించింది. యూరియా ఘటనలో చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను విమర్శించడమే ప్రతాప్‌రెడ్డి చేసిన తప్పు.
- ఈ కేసులో ఎలాంటి సంబంధం లేని సాయిభార్గవ్‌పై కూడా కేసు నమోదు చేసిన పరిస్థితుల్లో బెయిల్ రాగా, ప్రతాప్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు.
- గుంటూరు జిల్లా వికాస్ నగర్‌కు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు కనపర్తి శ్రీనివాస రావు ఫిర్యాదు మేరకు 'శివా సుప్రీమ్ శివా' అనే ఫేస్‌బుక్ ప్రొఫైల్ ద్వారా ముఖ్యమంత్రిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసి, కుల వివాదాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన ఘటనలో క్రైం నంబర్ 15/2025 నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐటీ అధికారులు తెలిపారు.
- విచారణలో ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన గడ్డం శివప్రసాద్ (36)ని అరెస్ట్ చేశారు.
- గుంటూరు, నెల్లూరు, అనంతపురానికి చెందిన కొందరిపై వీడియోలు మార్ఫింగ్ చేశారంటూ కేసులు నమోదు చేశారు.
- 2018లో టీడీపీకి వ్యతిరేకంగా పోస్ట్ చేశారంటూ కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ అనే దళిత వ్యక్తిపై కేసు పెట్టి జైలుకు పంపారు. ఆయన రాష్ట్రంలోని జాతీయ రహదారులతో పాటు ముఖ్యమైన రాష్ట్ర రహదారులకు కూడా టోల్‌గేట్లు పెట్టాలన్న తెలుగుదేశం పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వీడియో చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. దీనిపై ఏకంగా దారి దోపిడీ కేసు పెట్టి కర్నూలు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు.
- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మేకా వెంకటరామిరెడ్డిపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని కేసులు పెట్టి అరెస్టు చేశారు.
- వైఎస్సార్ సీపీ నాయకురాలు పాలేటి కృష్ణవేణిని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని చిలకలూరిపేట అర్బన్ పోలీసులు అరెస్ట్ చేయగా, ఆమె భర్త రాజకుమార్‌పై తెలుగుదేశం నాయకులు దాడి చేశారు.
- చిలకలూరిపేటకి చెందిన సుధారాణిపై స్టేషన్‌లోథర్డ్ డిగ్రీ ప్రయోగించారు.
- తెనాలి నియోజవర్గం కొల్లిపర మండలం వల్లభాపురం చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, రైతు ఆళ్ల జగదీష్ రెడ్డిపై 2018లో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌పై పోస్టు పెట్టాడని 2024లో విజయవాడ సైబర్ క్రైమ్ సిటీ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేశారు.
- యువజన విభాగం నాయకుడు కళ్లం హరికృష్ణారెడ్డి మీద పలు సోషల్ మీడియా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.
- వైఎస్సార్ సీపీకి చెందిన ఎస్సీ నాయకుడు బండారు జయకుమార్‌పై చిలకలూరిపేట పోలీసులు కేసు నమోదు చేశారు.
- సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఆధారాలు లభించకపోవడంతో కారుమూరి రాంబాబు వద్ద రూ.రెండు లక్షలు తీసుకొని డబ్బులు ఎగ్గొట్టి, అతనిపై దాడి చేశాడంటూ తప్పుడు కేసు పెట్టారు.
- చిలకలూరిపేట పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి దొడ్డా రాకేష్ గాంధీని టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అప్పటి నుంచి ఇతను అజ్ఞాతంలోనే ఉండాల్సి వచ్చింది.
- సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డ రోడ్డులో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తపై జూలై 24న రాత్రి హత్యాయత్నం జరిగింది.
- వినుకొండ మండలం పొనకాలపాలెం గ్రామానికి చెందిన నన్నపనేని వెంకట్రావుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.
- మాచర్ల రూరల్ పరిధిలోని కంభంపాడు గ్రామానికి చెందిన నెమలి దిన్నె రంగారెడ్డి సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ పోస్టులు పెడుతున్నారంటూ కేసు నమోదు చేశారు.
- గురజాల మండలంలోని తేలుకుట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పప్పుల వెంకటరామిరెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి గురజాల పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.
- గురజాల నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వెన్నా రాజశేఖర్‌రెడ్డిని, పిడుగురాళ్ల మండల సోషల్ మీడియా కన్వీనర్ షేక్ మాబులను అరెస్టు చేశారు.

ప్రతి అర్జీని పరిశీలించాల్సిందే !



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారీ

- జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా
- మొక్కుబడి పరిష్కారాలకు సెలవు
- పీజీఆర్ఎస్‌లో నూతన విధానం అమలు

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన ప్రతి అర్జీని పరిశీలించాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న తీరు, పరిష్కార విధానం, కౌంటర్లను ఆమె పరిశీలించారు. అనంతరం కొన్ని చేర్పులు, మార్పులకు శ్రీకారం చుట్టారు. రెవెన్యూ, జీవీఎస్‌డబ్ల్యూఎస్, రిజిస్ట్రేషన్, విద్యా, పోలీస్, విద్యుత్ తదితర శాఖలకు సంబంధించిన వినతులు ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించి, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి అర్జీని నిర్దేశిత సమయంలో పరిష్కరించాల్సిందేనని ఆదేశించారు. వివరాలు ముందుగా అవగాహన చేసుకోవాలని, ప్రభుత్వ విధానాలకు సంబంధించిందా లేదా ఇతర అంశాలకు సంబంధించిందా అనేది చూడాలని ఆదేశించారు. అర్జీలకు సంబంధించి స్పష్టమైన, వాస్తవ వివరాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు. సోమవారం అందిన అర్జీలు శుక్రవారం నాటికి పూర్తి చేసి డేటాను అప్ లోడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 222 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్.కె.ఖాజావలి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి గంగరాజు, డెప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయలక్ష్మి, జిల్లా అధికారులు పరిశీలించారు.

ఉపాధి పోతే జీవనం ఎలా ?

గుంటూరులో సుమారు 500 పానీపూరి బండ్లు ఉన్నాయి. కొన్ని వందల కుటుంబాలు వీటిపై ఆధారపడి జీవిస్తున్నాయి. డయేరియా ఉందని అధికారులు వీటిని తక్షణం మూసేయాలని నోటీసులిచ్చారు. మేమంతా ప్యూరిఫై చేసిన క్యాన్ వాటర్‌తో ఎంతో శుభ్రంతో వ్యాపారం చేస్తున్నాం . మా పొట్టపై కొడితే కుటుంబాలు ఎలా జీవించాలి? అధికారులు ఆలోచించి మాకు న్యాయం చేయాలని ప్రార్థన.

-పానీపూరీ బండ్ల నిర్వాహకులు

భూముల నష్టపరిహారం ఇప్పించండి

గుంటూరు చానల్ విస్తరణలో భాగంగా ప్రత్తిపాడు మండలం, కొండేపూడి, గారపాడు రైతులు విలువైన భూములను కోల్పోతున్నారు. గుంటూరు చానల్ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తున్నాం. పేద రైతుల భూములకు నష్టపరిహారం అందించాలి. భూమికి బదులు భూమి గానీ, నష్టపరిహారానికి గానీ సిద్ధంగా ఉన్నాం. కేంద్ర ప్రభుత్వం 2013 భూ హక్కు చట్టం ప్రకారం న్యాయం చేయాలి.

-బాధిత రైతులు, రైతు కూలీ సంఘం నాయకులు

పోటెత్తిన కృష్ణమ్మ

- పల్లపు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన అరటి, పసుపు, కంద పంటలు



కొల్లిపర కరకట్ట దిగువున నీట మునిగిన పసుపు తోట

కొల్లిపర: ఎగువ కురిసిన భారీ వర్షాలతో కృష్ణమ్మ పోటెత్తింది. కృష్ణా బ్యారేజీ నుంచి 6.80లక్షల క్యూసెక్కులను సోమవారం అధికారులు దిగువకు విడుదల చేయడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీరు ఒక్కసారిగా పోటెత్తడంతో కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు గ్రామాల్లో నదికి దిగువున ఉన్న పంట పొలాలు, పాత బొమ్మువానిపాలెం, అన్నవరపులంక, కొత్తూరులంక గ్రామాల్లో పలు వాణిజ్య పంటలు నీటిలో మునిగి పోయాయి. కరకట్ట దిగువున లంక గ్రామాల్లోని నాలుగు వేల ఎకరాల్లో అరటి, కంద, పసుపు, మొక్కజొన్న, మినుము, కూరగాయలు, నిమ్మ పంటలను సాగు చేపట్టారు. ఇందులో వెయ్యి ఎకరాల దాకా నీట మునిగాయి. వరద నీటితో అరటి, కంద, పసుపులకు దుంప కుళ్లి పోతుందని వాపోతున్నారు. వరద నీరు బయటకు పోయిన తరువాత నిదానంగా చనిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు పంటలను కన్న బిడ్డలా కాపాడుకుంటూ వచ్చామని, తెగుళ్లు లేకుండా ఏపుగా పెరుగుతున్న సమయంలో వరద నీరు తమకు అప్పులు తెచ్చిపెడుతుందని పలువురు రైతులు వాపోతున్నారు.



పిడపర్రు కరకట్ట దిగువున నీట మునిగిన కంద



కొల్లిపర కరకట్ట దిగువున నీట మునిగిన అరటి

ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ

పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: కూటమి పాలనలో నమోదయ్యే అక్రమ కేసులతో వెనకాడేది లేదని, నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం పొన్నూరు మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన ఓ కేసులో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనలో బాధితుల పక్షాన నిలిచిన వారిపై అక్రమ కేసులు బనాయించడం సర్వసాధారణంగా మారిందని విమర్శించారు. జరిగిన అన్యాయంపై ఆవేదనకు గురైన ఓ బాధిత మహిళ పక్షాన నిలిచి, ఆమెకు న్యాయం చేయాలని కోరుతూ మీడియాతో మాట్లాడినా కూడా కేసు నమోదు చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్‌లో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు ఇప్పటికే వందలాదిగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న మురళీకృష్ణ

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	36,167
అమ్మకాలు	25,839
నిల్వ	4,715

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,200
నంబరు-5	10,000-14,100
273	10,500-13,600
341	10,000-14,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,400
నంబరు-5	10,000-14,000
341	10,000-14,800
4884	10,000-13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,600
బాడిగ-355	10,000 - 15,000
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,000
తాలుకాయలు	6,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,700
బాడిగ - 355	10,000-15,000
దేవనూరు డీలక్స్	10,500-14,200
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 569

కొమ్ములు : 416 బస్తాలు
(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,450	10,300	10,300

కాయలు : 216 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,450	10,300	10,000

మొత్తం అమ్మకాలు : 100.50 క్వింటాళ్లు

- దుగ్గిరాల

ప్రభుత్వ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి సోమవారం సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలు, ధరలు తగ్గుదలపై గ్రామీణ, పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి జిల్లా కార్యాలయంలో జీఎస్టీ 2.0పై అవగాహన కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతిరోజు నీటి శాంపిల్స్ తీయాలని, క్లోరినేషన్ తరువాత మాత్రమే నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో దోమలు నియంత్రణకు డ్రెయిన్లలో ఆయిల్ బాల్స్, ఫాగింగ్‌కు కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. తల్లికి వందనం నగదు జమ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆటో మిత్రలో ఆమోదం పొందిన దరఖాస్తుల ఈకేవైసీ నూరుశాతం తక్షణమే పూర్తి చేయాలని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న వివిధ సర్వేలు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేలా ఎంపీడీవో, కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అథ్లెట్స్ రోషన్, రమేష్‌లకు ఉత్తమ క్రీడాకారుల అవార్డులు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో గుంటూరుకి చెందిన ఎస్‌కే రోషన్, బి. గణ రమేష్‌లకు ఉత్తమ క్రీడాకారుల అవార్డులను ప్రదానం చేశారని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్.కె రోషన్ అండర్ -20 యువకుల విభాగంలో 110 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌ను 13.8 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అండర్ 14 బాలుర ట్రయాథ్లన్ విభాగంలో బి.గణ రమేష్ బంగారు పతకాలు సాధించి ఉత్తమ క్రీడాకారుల ట్రోఫీలను అందుకున్నట్లు తెలియజేశారు. వీరిద్దరూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అంతర్జాతీయ క్రీడాకారుడు, శిక్షకుడు కృష్ణమోహన్, కె.రవి వద్ద శిక్షణ పొందినట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి



బాధితురాలి మొర ఆలకిస్తున్న ఎస్పీ

నగరంపాలెం: పొలంలో కొంతమేర ఆక్రమించారని అధ్యాపకుడు, అద్దెల్లు చెల్లించకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నారని మరొకరూ వాపోయారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు- పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో పలువురు బాధితులు ఫిర్యాదులు చేశారు. అర్జీలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వీకరించారు. బాధితుల మొరను ఆలకించారు. చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫిర్యాదులకు పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఎప్పటికప్పుడు అర్జీలు పరిష్కరించేలా దిశా నిర్దేశం చేస్తామని చెప్పారు. జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), అరవింద్ (గుంటూరు పశ్చిమ) కూడా అర్జీలు స్వీకరించారు.

అద్దెలు చెల్లించడం లేదు

గుంటూరు నగరంలోని జార్జిపేటలో ఏడు గదులతో ఇల్లు ఉంది. వాటి ద్వారా వచ్చే అద్దెలతో జీవిస్తుంటా. గత మూడేళ్లుగా ఉంటున్న ఓ మహిళా కుటుంబం అద్దె చెల్లించడం లేదు. అదేమని అడిగితే ఫలానా కులం వారమని బెదిరిస్తోంది. అక్రమ కేసులు బనాయిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతోంది. అంతేగాక స్థానిక పోలీసులకు నాపై తప్పుడు ఫిర్యాదులిచ్చి, మానసిక వేధింపులకు గురి చేస్తోంది. దీంతో మిగతావారు కూడా సరిగా అద్దెలు చెల్లించడంలేదు. ఆస్తిని అక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. న్యాయం చేయాలి.

– అష్రపున్నిసా బేగం, పట్టాభిపురం

పది సెంట్లు ఆక్రమణ

పన్నెండేళ్ల కిందట నిడుబ్రోలులో 94 సెంట్ల పొలం కొనుగోలు చేశా. అయితే, మూడేళ్ల కిందట సర్వే చేయించగా ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా పది సెంట్ల పొలం అక్రమించి, హద్దు రాళ్లు వేశారు. నా పొలం నుంచి బయటకు వెళ్లాలని అడిగినా ఆలకించడం లేదు. అంతేగాక నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. మరోసారి సర్వేకు అప్లై చేశానని, వారి నుంచి అక్రమణకు గురైన 10 సెంట్ల పొలం ఇప్పించాలని కోరుతున్నా. అంతేగాక వారి నుంచి రక్షణ కల్పించాలి.

– నర్రా శ్రీనివాస్, పొన్నూరు, ప్రభుత్వ అధ్యాపకుడు

ముగిసిన రాజ్ భాషా వేడుకలు



బహుమతులు అందజేస్తున్న డీఆర్ఎం సుధేష్ట సేన్

లక్ష్మీపురం: గుంటూరు డివిజన్ పరిధిలో ఈనెల 14 నుంచి 29 వరకు నిర్వహించిన రాజ్ భాషా పక్షం -2025 వేడుకలు సోమవారంతో ముగిశాయి. గుంటూరు పట్టాభిపురంలోని డివిజన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో డీఆర్ఎం సుధేష్ట సేన్ మాట్లాడారు. వేడుకల్లో భాగంగా హిందీ వర్క్‌షాప్‌లు, హిందీలో సాంకేతిక సెమినార్లు, డిపార్ట్‌మెంటల్ సమావేశాలు, హిందీ కీబోర్డ్ శిక్షణ, హిందీ పోటీలు, వ్యాసం, వకృత్వం, టైపింగ్, క్విజ్, జ్ఞాపకశక్తి, హిందీ పదజాలం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. హిందీని అధికారిక భాషగా ప్రచారం చేయడం మన బాధ్యతని చెప్పారు. డీజీఎం శ్యామ సుందర్ సాహు మాట్లాడుతూ రాజ్ భాష అమలు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్న ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎస్. రమేష్ కుమార్, బ్రాంచ్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జూనియర్ వరల్డ్ కప్‌లో ముఖేష్‌కు రజతం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఢిల్లీలో నిర్వహిస్తున్న జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్ షూటింగ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఫిస్టల్ విభాగంలో గుంటూరుకు చెందిన ముఖేష్ నేలవల్లి రజతం సాధించాడు. ఈ మేరకు మెంటార్, అతని తండ్రి నేలవల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ముఖేష్ వెళ్లిన ప్రతి అంతర్జాతీయ పోటీలోనూ పతకం సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

8వ రౌండ్‌కు చేరిన జాతీయ చెస్ పోటీలు



చేబ్రోలు: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ విజ్ఞాన్ యూనివర్సిటీ వేదికగా నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ఆసక్తికరంగా జరిగాయి. ఎనిమిదో రౌండ్ ముగిసే సరికి, పీఎస్‌పీబీకి చెందిన నాలుగు సార్లు జాతీయ విజేత జీఎం కృష్ణన్ శశికిరణ్ తన జట్టు సహచరుడు జీఎం దీప్‌సెం గుప్తాపై గెలిచాడు. అదే జట్టుకు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ అభిజీత్ గుప్తా యూపీకి చెందిన ఐఎం ఎలెక్ట్ అజయ్ సంతోష్ పర్వతరెడ్డిపై విజయం సాధించారు. దీంతో శశికిరణ్, అభిజీత్‌లు చెరో ఏడు పాయింట్లతో టాప్‌లో నిలిచారు. వీరికి సగం పాయింట్ వెనుక ఆరుగురు ఆటగాళ్లు (తమిళనాడు జీఎం ఇనియన్, రైల్వేస్ జీఎం దీపన్ చక్రవర్తి, నలుగురు ఐఎంలు) ఉన్నారు.

ఆకట్టుకున్న వీణా సింఫనీ



తెనాలి: శ్రీదేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం రోజైన సోమవారం సాయంత్రం తెనాలిలో 108 వీణల ఘన సప్తస్వర సమ్మేళనం (వీణా సింఫనీ) నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) ఆధ్వర్యంలో 108 మంది వైణికుల వాద్య స్వర తరంగాలు ఒకే సమయాన ఆడిటోరియంలో ఆవహించాయి. దివ్యానంద సుడిగాలిలా భక్తులను చుట్టుముట్టాయి. స్థానిక చెంచుపేటలోని పద్మావతి కల్యాణ మండపంలో ఈ ఆధ్యాత్మిక సంగీత యజ్ఞాన్ని వేడుకగా చేశారు. బాలస్వామీజీ స్వయంగా వీణావాదన చేశారు. సరస్వతీ దేవికి ప్రీతిపాత్రం వీణ అని తెలిసిందే. వీణ ధ్వనిని వేదమంత్రాల నాదంతో సమానంగా పరిగణిస్తారు. ఇక 108 సంఖ్య హిందూ సంప్రదాయంలో పవిత్రమైనది. జపమాలలో ఉండే గింజల సంఖ్య 108. అంతమంది వైణికులు ఒకేసారి వీణ వాయించటమంటే జపమాల గింజల్లా ప్రతి స్వరం ఒక మంత్రధ్వనిగా మారటం అన్నమాట! శ్రోతలలో భక్తి, శాంతి, ఆనందం, ఆత్మశుద్ధిని కలిగించే ఆధ్యాత్మిక యజ్ఞంలా జరిగింది. పట్టణానికి చెందిన శ్రీ విద్యా పీఠం, సాలిగ్రామ మఠం, జయలక్ష్మి మాతృమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా సంస్థల బాధ్యులు నంబూరి వెంకటకృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరరావు, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, పల్లపోతు మురళీ మనోహర్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీ కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్‌గా పాల్ సుధాకర్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్‌గా (డీడీ) బండి పాల్ సుధాకర్‌ను నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన గుంటూరు మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతి ద్వారా డీడీగా విధుల్లో చేరనున్నారు. కడపకు చెందిన పాల్ సుధాకర్ హాకీ క్రీడలో ప్రతిభ చాటారు. పలుమార్లు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడంతో స్పోర్ట్స్ కోటాలో 1993లో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికై, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో విధుల్లో చేరారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా, పరిపాలనా అధికారిగా పదోన్నతులు పొంది 2014 వరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో పని చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొంది గుంటూరు జీజీహెచ్‌కు 2015లో బదిలీ అయ్యారు. అక్కడి నుంచి గుంటూరు వైద్య కళాశాలకు 2019లో బదిలీ అయ్యారు. నేడు పదోన్నతి పొంది గుంటూరు ఆర్డీ కార్యాలయం డీడీగా విధుల్లో చేరనున్నారు.

ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం చేసిన యువకుడు

యర్రబాలెం(మంగళగిరి): ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం చేసిన ఘటన యర్రబాలెం బీసీ కాలనీలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలోని యర్రబాలెం బీసీ కాలనీకి చెందిన మైనర్ బాలిక అదే ప్రాంతానికి చెందిన సందీప్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బాలికను వివాహం చేసుకోవాలని కుటుంబసభ్యులు కోరగా నిరాకరించాడు. దీంతో బాలిక కుటుంబసభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

ప్రజలకు తగ్గనున్న వైద్య ఖర్చులు

గుంటూరు మెడికల్: అత్యవసర మందులు, వైద్య పరికరాలపై ప్రభుత్వం జీఎస్టీని 12 నుంచి ఐదు శాతానికి తగ్గించడం వల్ల ప్రజలకు ఖర్చులు తగ్గుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా శిశువులకు ఉపయోగించే న్యాప్కిన్లు, ఫీడింగ్ బాటిల్స్, వ్యక్తిగత ఆరోగ్య బీమా అంశాలపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపును ఇచ్చారని పేర్కొన్నారు. క్యాన్సర్ కారకమైన పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న జీఎస్టీ 28 నుంచి 40 శాతానికి పెంచడం వల్ల వినియోగం తగ్గుతుందన్నారు. తద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని తెలిపారు. వైద్యశాఖ అధికారులు, వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

చట్టాలపై వృద్ధులకు అవగాహన

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు, క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా న్యాయ విజ్ఞాన సంస్థలో సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి కార్యదర్శి ఎం.కుముదిని సదస్సును ప్రారంభించారు. వృద్ధులకు న్యాయపరంగా ఉన్న సెక్షన్లు, హక్కులు, పిల్లల ద్వారా మోసపోయిన వారికి తిరిగి ఆస్తిని పొందే చట్టాల గురించి ఆమె వివరించారు. వృద్ధులు ఎదుర్కొనే పలు సమస్యలు, వాటి పరిష్కారాల గురించి స్టేట్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్.పరమేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్స్, వృద్ధులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలపై 13, 14 తేదీల్లో ఆందోళన



లక్ష్మీపురం: కౌలు రైతుల సమస్యలపై అక్టోబర్ 13, 14 తేదీల్లో మండల కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు చెప్పారు. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులందరికీ భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపచేయాలని కోరారు. ఈ క్రాప్ నమోదు చేసి ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర నష్ట పరిహారాలు వర్తింప చేయాలన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష మంది కౌలు రైతులున్నారని, 70 శాతం వారే సాగు చేస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రాల్లో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, సాంబిరెడ్డి, కృష్ణ, అమ్మిరెడ్డి, నీలాంబరం పాల్గొన్నారు.